కడప క్యాసినో బంద్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(కడప-ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాలు, దేశాలను తలపించే విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న కడప క్యాసినో బంద్ అయింది. ఆంధ్రజ్యోతిలో ఆదివారం కడప క్యాసినో పేరుతో కథనం ప్రచురితమైంది. పోలీసుశాఖలో ఓ త్రీస్టార్ ఆధ్వర్యంలో జరుగుతున్న జూదాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రచురితమైంది. ఇది పోలీసుశాఖతో పాటు సంచలనంగా మారింది. జిల్లాలో కడప, మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల పరిధిలో క్యాసినో జూదం జరుగుతున్నట్లు చెబుతారు.ఇందుకు గాను ఓ సారుకు ఒక్కో చోట నుంచి రూ.3లక్షలు ముట్టజెబుతున్నట్లు ప్రచారం ఉంది. పోలీసుశాఖలో ఆయనే బాస్ అనే ఫీల్ అవుతుండడంతో జూదంపై దాడులు లేకపోవడంతో మూడుపువ్వులు ఆరు కాయలుగా జరుగుతుంది. అయితే ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన తరువాత ఈరోజు గేమ్ లేదంటూ నిర్వాహకులు ఆటగాళ్లకు చెప్పినట్లు సమాచారం. దీంతో జిల్లాలో శనివారం వరకు జరిగిన కడప క్యాసినో ఆదివారం బంద్ అయింది.

ఉండేదెవరో.. పోయేదెవరో..!



సీఎం జగన్ సొంత జిల్లాలోనే వైసీపీ భవిష్యత్తుపై ఆ పార్టీ నేతల్లో ఆందోళన ఉన్నట్లు అర్థమవుతుంది. ఎమ్మెల్సీ రామచంద్రయ్య వైసీపీకి బైబై చెప్పి టీడీపీ గూటికి చేరారు. ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి సైకిలెక్కేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో ప్రతి చోట వైసీపీ నుంచి టీడీపీ గూటికి చేరుతున్నారు. స్లోపాయిజన్‌లాగా వైసీపీ కేడరు అంతా టీడీపీ గూటికి చేరుతోంది. అయితే ఇది వైసీపీ ముఖ్యులను కలవరపెడుతుంటే.. ఇక స్థానిక సంస్థల్లో కీలకంగా ఉన్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఫ్యానుకు బైబై చెప్పి సైకిలెక్కే ప్రయత్నం చేస్తున్నారు. కడప కార్పోరేషన్‌లో పలువురు కార్పొరేటర్లు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు సైకిలు ఎక్కేందుకు సిద్ధమవడం వైసీపీని షాక్ గురిచేస్తోంది. జిల్లాలో జరుగుతున్న వరుస సంఘటనలతో వైసీపీలో ఉండేదెవరో, పోయేదెవరో అనే పరిస్థితికి దారి తీస్తున్నట్లు చెబుతున్నారు. వచ్చేఎన్నికలకు మేం సిద్ధమంటూ జగన్ శిబిరం సిద్ధం పేరిట పోస్టర్లు వేసుకున్నప్పటికీ ఎన్నికలలో కీలకమైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు జారుకునే యత్నంలో ఉండడం వైసీపీని కలవరపాటుకు గురి చేస్తుంది.

- వైసీపీలో కలవరం
- కడపలో కార్పొరేటర్లు
- ప్రొద్దుటూరులో కౌన్సిలర్లు
- టీడీపీ వైపు చూపు
- క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు
- తాయిలాలు ఇచ్చి బుజ్జగించే యత్నం
- ప్రలోభాలకు గురి చేస్తున్న వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పోరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా టీడీపీ ఒక వార్డును గెలుచుకుంది. మరో కార్పొరేటరు టీడీపీలో గెలిచినప్పటికీ వైసీపీలో కొనసాగుతున్నారు. అయితే మొత్తం 49 మంది కార్పొరేటర్లు వైసీపీలో ఉన్నారు. అయితే ఇక్కడ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాదరెడ్డి అనుచరులుగా కొందరు కార్పొరేటర్లు ముద్ర పడ్డారు. కార్పొరేషన్‌లో పెత్తనమంతా మేయరు సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషాదే. అయితే పనుల కేటాయింపులు, ఇతరత్రా వాటిలో తమ ప్రాధాన్యత లేదంటూ కొందరు కార్పోరేటర్లు డిప్యూటీ సీఎం, మేయరులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారంటారు. దీంతో పాటు మేయరు సురేష్ బాబుకు ఈసారి ఎమ్మెల్యే టికెట్ కావాలంటూ ఆయన అనుచర కార్పొరేటర్లు పాటుపడుతున్నారు. ఇక కమలాపురం ఎమ్మెల్యే రవిరెడ్డికి కానీ, ఆయన కొడుకుకు కానీ కడప టికెట్ ఇవ్వాలన్నది ఆయన అనుచర కార్పొరేటర్ల డిమాండ్. డిప్యూటీ సీఎం, మేయరు, కమలాపురం ఎమ్మెల్యేలు సమావేశాలలో పైకి బాగా కనిపిస్తున్నా కడుపులో కత్తులు పెట్టుకుని వ్యవహరిస్తున్నారని వారి వర్గీయులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కాంట్రాక్టు పనులు, పదవులు ఇతర వాటిల్లో కనీసం కొందరు కార్పోరేటర్లును పక్కనబెట్టేశారు. దీంతో వారంతా పార్టీ కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు చెబుతారు. అనంతపురంలో సిద్ధం పేరిట వైసీపీ సమావేశం నిర్వహించనున్నారు. కడప జిల్లా నుంచి పదివేలు జనాన్ని సిద్ధం సభకు తీసుకెళ్లేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా శనివారం అపూర్వ కల్యాణమండపంలో సిద్ధం సభ కోసం మీటింగ్ ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు వైసీపీ నేతలు హాజరుకావడంతో పాటు కార్పొరేటర్లు హాజరయ్యారు. ఇండిపెండెంటుతో కలుపుకుంటే 49 మంది కార్పొరేటర్లు వైసీపీలో ఉన్నారు. అయితే శనివారం నాటి సమావేశానికి 19 మంది కార్పొరేటర్లు డుమ్మా కొట్టడం హాట్‌టాపిక్‌గా మారింది. వ్యక్తిగత పనులతో కడపలో అందుబాటులో లేమని చెప్పి సమావేశానికి గైర్హాజరైనట్లు వైసీపీ భావిస్తున్నప్పటికీ కడపలోని ముఖ్యులు కూడా మీటింగ్‌కు హాజరుకాకపోవడం చర్చనీయంశంగా మారింది.

28 మంది కార్పొరేటర్లు టీడీపీకి టచ్‌లో...

వైసీపీ చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కలిసి 28 మంది టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి సుమారు 28 మంది కార్పొరేటర్లు ఇటీవల నూతన సంవత్సరం రోజు శుభాకాంక్షలు చెప్పినట్లు చెబుతున్నారు. పేరుకు కార్పొరేటర్లు, ఎలాంటి గుర్తింపు లేదు, పార్టీ కోసం ఎంతో పోగొట్టుకున్నాం, సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని అప్పులపాలయ్యాం.. మమ్మల్ని పట్టించుకునే వారు లేరంటూ మదనపడుతున్నారు. అలాంటి వాళ్లు టీడీపీ వారు ఆహ్వానిస్తే సైకిలు ఎక్కాలని డిసైడ్ అవుతున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా శ్రీనివాసరెడ్డికి టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. శనివారం నాటి సమావేశానికి సుమారు 19 మంది కార్పొరేటర్లు గైర్హాజరు కావడం ఈ వాదనకు బలం చేకూర్చింది.

ప్రొద్దుటూరులో సిద్ధంగా కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 41 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో 40 మంది వైసీపీ వారే. అయితే అక్కడ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆయన బామ్మర్ది బంగారురెడ్డి వ్యవహారశైలిపై కొందరు కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారంటారు. ఇప్పటికే వారికి వ్యతిరేకంగా కొందరు వార్డు కౌన్సిలర్లు తిరుగుబాటు చేయగా, వీరిలో ఒకరు టీడీపీ గూటికి చేరారు. ఇక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీరిలో చంద్రబాబు సమక్షంలో చేరేందుకు సిద్ధమైనట్లు చెబుతారు. వీరి కోసం టీడీపీ నేతలు శిబిరాన్ని ఏర్పాటు చేశారంటారు. అయితే కౌన్సిలర్లు టీడీపీ గూటికి పోతుండడం వైసీపీలో కలకలం రేపింది. దీంతో నష్ట నివారణ కోసం ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బామ్మర్ది బంగారురెడ్డిలు హైదరాబాదులో లుంబినీ పార్కులో ఉన్న ముగ్గురు కార్పొరేటర్లను గుర్తించి వారిని బుజ్జగించి పార్టీ మారకుండా మంతనాలు జరిపినట్లు చెబుతారు. సీఎం సొంత జిల్లాలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పార్టీ మారితే అధిష్ఠానం సీరియస్ అవుతుందన్న భయంతో వీరందరికీ తాయిళాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పుకొస్తున్నారు. తాయిలాలు ఇచ్చినా ఉంటారా.. పోతారా అన్న భయం వెంటాడుతూనే ఉంది.



రైతులంతా సంఘటితం కావాలి

● మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రాజుపాలెం, ఫిబ్రవరి 4: రాబోవు తరానికి వ్యవసాయంలో ఇబ్బందులు లేకుండా రైతులంతా ఐక్యతగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. ఆదివా రం రాజుపాలెం మండలంలో వెల్లాలలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో రైతు సదస్సు జరిగింది. ఈసదస్సుకు రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రైతులంతా తమ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సాగునీటికి రాజోలి, గుండ్రేవుల నిర్మాణం పూర్తి చేసి కేసీ కెనాల్ స్థిరీకరణ చేయాలన్నారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న మైలవరం కాల్వలను ఆధునికీకరించి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కల్పించాలన్నారు. రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని రైతుల గురించి ఆలోచించాలని, ఇక్కడ వారికి ఏం చేస్తే మేలు జరుగుతుందన్న దానిపై ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందిస్తే మంచిదని ఒక పార్టీ, గోదావరి జలాలు మళ్లిస్తే బాగుంటుందని మరో పార్టీ నేతలు రైతులను మభ్యపెట్టడమే తప్ప రాయలసీమ ప్రజలకు ఎలా చేస్తే బాగుంటుందని ఎవరూ ఆలోచించడం లేదన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా రైతాంగం సమస్యలపై నడుం బిగించాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఉమ్మడిసహదేవరెడ్డి మాట్లాడుతూ ఈప్రాంతంలో నీరంతా కళ్ల ముందే దిగువకు వెళుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. కందూనది నుంచి వేలాది క్యూసెక్కుల నీరు తరలివెళుతోందని.. ఇక్కడ రైతుల బాగోగుల గురించి పట్టించుకునే వారు లేరన్నారు. కార్యక్రమంలో రాయలసీమ కార్మికుల సాధన సమితి అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు నంద్యాల రాఘవరెడ్డి, వైఎస్‌రెడ్డి, వెల్లాల దేవస్థానం మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, కొర్రపాడు రామచంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

12వ పీఆర్సీ కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహులు, శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు జూలై 2023 నుంచి వర్తించే విధంగా 12వ పీఆర్సీ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాం సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం సీఎస్ఐ పాఠశాలలో కౌన్సిల్ విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ సంఘం కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆరు నెలలైనా కమిషన్ ఇంతవరకు బాధ్యతలు చేపట్టలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి వెంటనే సీఎం ఉద్యోగ సంఘాలతో చర్చించి 30 శాతం ఫిట్‌మెంటుతో పీఆర్సీని ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు నాలుగు సంవత్సరాలుగా రావాల్సిన ఆర్థికపరమైన బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణం ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాలసిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని లేకుంటే ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనరు ముత్యాలప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట కౌన్సిలరు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, గురయ్య, సురేంద్ర నాధరెడ్డి, జిల్లా నాయకులు మునివర్ధన్‌కుమార్, రమేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి

ఇళ్లే.... పూర్తి చేయలేదు

- పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ల పేరుతో గాలం
- పదేళ్ల తరువాతే పూర్తి హక్కులు
- అవగాహన లేని సిబ్బందితో రిజిస్ట్రేషన్లు
- మొరాయిస్తున్న సర్వర్
- వారం రోజులుగా కోట్లాది రూపాయిల రాబడికి బ్రేక్



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: పేదోడికి ఇంటి స్థలం ఇవ్వాలంటే అర్హతలను గుర్తించేందుకు సచివాలయం సిబ్బంది నుంచి తహసీల్దార్ వరకు ఫిల్టర్ చేస్తారు. 6 అంశాలైన అధిక విద్యుత్ వాడకం, కారు, భూమి, ఇన్‌కంటాక్స్, ఉద్యోగం లాంటి అంశాలను పరిశీలిస్తారు. అంతే కాకుండా అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు ఆధార్‌కార్డు ఆధారాలతో పంపితే ఇంటిస్థలం మంజూరు చేస్తారు. పేదలకు ఇచ్చే ఆ ఇంటికి గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ భరోసాతో ముద్రిస్తారు. ఇప్పటికే భూముల రీసర్వే పేరుతో పాస్‌బుక్‌లకు హక్కుదారుడైన రైతు ఫొటోకు బదులు ముఖ్యమంత్రి ఫొటో ముద్రించడం రైతుల్లో కలకలం రేపింది. సొమ్మొకడిది సోకొకడిదీ అన్నట్లు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇది చాలదన్నట్లు గ్రామ సచివాలయం నుంచి కలెక్టర్ వరకు అన్ని రకాలుగా ఆరా తీసి పేదలకు ఇచ్చిన సెంటో, సెంటున్నరో స్థలాలకు రిజిస్ట్రేషన్ల పేరుతో కొత్త ఎత్తులకు జగన్ సర్కారు దిగింది. గతవారం రోజులుగా అవగాహన లేని సచివాలయపు సిబ్బంది జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు పడరాని పాట్లు పడుతున్నారు. ఆగమేఘాలతో జరుగుతున్న ఈ రిజిస్ట్రేషన్లతో పేదలకు ఇప్పటికిప్పుడు ఒరిగేదేమిలేదు. పదేళ్ల తరువాతే అమ్మే హక్కులు వస్తాయి. ఈ తతంగం అంతా పేదల పేదల ఓట్లకు గాలం వేయడమేననే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇళ్లే కట్ట లేదు కానీ...

నిత్య జీవితంలో సగటు మనిషి ఇళ్లు కట్టడం, పెళ్లి చేయడం సవాలే. అయితే పేదలకు మూకుమ్మడిగా ఇళ్లు కట్టడం, వారి సంక్షేమాలకు పాటుపడే పథకాలను అమలు చేయ డం కేవలం ప్రభుత్వాలకే సాధ్యం. పేదలకు ఇళ్లు కట్టించడమే కాదు... వారి చేతికి తాళాలు ఇస్తానంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామి ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఆర్భాటంగా జిల్లాలో లక్షా 23 వేల మందికి ఇంటి స్థలాలు ఇవ్వడమే తప్ప, అందులో నేటికి 30 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక అధికారులు చతికల పడ్డారు. ఇళ్లు కట్టి జగన్ వద్ద మార్కులు కొట్టేద్దామని అనంతపురం, నెల్లూరు, ఇతర సంస్థలకు చెందిన 20 మంది కాంట్రాక్ట్ కంపెనీలు కూడా పేదల ఇళ్లు కట్టించలేక వెను దిరిగారు. దీంతో పేదలకు ఇచ్చిన మాట నెరవేర్చలేదనే అపవాదు మూటగట్టుకున్న జగన్ సర్కారు కొత్త ఎత్తుగడలకు తెరలేపింది. సార్వత్రిక ఎన్నికలు కేవలం రెండు నెలలు ఉండడంతో పేదల ఇళ్లను రిజిస్ట్రేషన్లు చేసి గంప గుత్తగా ఓట్లు దండుకునేందుకు ఎత్తుగడకు దిగిందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. అసలే ఇళ్లే కట్టుకోలేక నిరాశతో ఉన్న పేదలకు ఆర్థిక సాయం చేయాల్సిన సర్కారు, ఆయన బొమ్మతో ముద్రించిన ఇంటి పట్టాలు కాకులో, గద్దలో తన్నుకుపోతున్నట్లుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ల పేర పేదల ఓట్లకు గాలం వేయడం జగన్నాటకమని విమర్శలు వినిపిస్తున్నాయి.

వారం రోజులుగా సర్వర్లు మొరాయింపు

గత వారం రోజులుగా పేదల ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టినా సర్వర్లు మొరాయిస్తున్నాయి. రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ, డీఆర్, సబ్ రిజిస్ట్రార్‌ల వరకు సచివాలయాల సిబ్బందికి తర్ఫీదు ఇచ్చే పనిలో పడ్డారు. ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తెరిచి, సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్లు సిబ్బంది ఉండడం గమనార్హం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా లాగిన్ అయినా ఎంప్లాయి ఐడీ రాకుండా పోవడం, పాస్ వర్డ్, గ్రామాల పేర్లు సెలెక్ట్ కాక పోవడంతో పాటు సర్వరు మొరాయింపు తోడవడంతో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో జిల్లాలో జరగాల్సిన 12 రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల నుంచి ఎలాంటి క్రయ, విక్రయాలు జరగక బాధితులు లబోదిబోమంటున్నాన్నారు. రోజుకు దాదాపు కోటి రూపాయి వరకు టార్గెట్ ఉంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అనుసంధానంగా సచివాలయాలల్లో జరుగుతున్న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు ఒక్కటే సర్వరు కావడంతో ఈ వారం రోజుల్లో దాదాపు రూ.5 కోట్ల వరకు రాబడికి తాత్కాలిక బ్రేకులు పడ్డాయి. దీంతో భూములు, స్థలాలు ఇతరత్రా రోజు వారీగా రిజిస్ట్రేషన్లకు వచ్చే బాధితులు సర్వర్ల మొరాయింపుతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఇప్పటి వరకు రెండు వేల రిజిస్ట్రేషన్లే..

- పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల పక్రియ సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో గత నాలుగు రోజులుగా 2వేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. సచివాలయ సిబ్బందికి ఇప్పటికే తర్ఫీదు ఇచ్చాం. గత నాలుగు రోజులుగా సచివాలయాల పరిధిలో సాంకేతిక లోపాలను సరిదిద్ది అవగాహన కల్పించేందుకు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని సచివాయాలను సందర్శిస్తున్నారు. ఆదివారం కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తెరిచి సందేహాలు నివృత్తి చేస్తున్నాం.

వందల కోట్లు ఖర్చు పెడుతున్నా..
రోడ్లు ఏవీ?

పులివెందులటౌన్, ఫిబ్రవరి 4: వందల కోట్లు ఖర్చు పెడుతున్నా సిమెంటు రోడ్లు ఏర్పాటుకాకపోవడం దారుణమని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ఆదివారం ఆయన రోటరీపురంలో విలేకరులతో మాట్లాడుతూ పాత రోటరీపురంలో సిమెంటు రోడ్లు లేనేలేవన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో వందల కోట్లతో జనావాలు లేనిచోట సిమెంటు రోడ్లు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికి జనావాసాలు పూర్తిస్థాయిలో ఉన్న చోట సిమెంటు రోడ్లు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా పలుచోట్ల ఉప్పునీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చర్మవ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సీబీఆర్‌లో నీరు ఉన్నప్పటికి పద్ధతిగా వాడినట్లయితే అందరికి నీరు ఇవ్వచ్చు అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే తప్పకుండా ఈ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతకంటే ముందు రోటరీపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోటరీపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

అప్పుల బాధతో రైతు మృతి


మారెన్న మృతదేహం

మైలవరం, ఫిబ్రవరి 4: పొన్నంపల్లి గ్రామానికి చెందిన నల్లసింగ్ మారెన్న (40) అనే రైతు అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మైలవరం ఎస్‌ఐ రెడ్డిసురేశ్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... మారెన్నకు 3.75 ఎకరాల పొలం ఉండగా పంటలు సరిగా పండక పోవడంతో గత ఏడాది ఎకరా పొలం అమ్మారన్నారు. కానీ ఈ ఏడాది కూడా పంట దిగుబడులు సరిగా రాక పోవడం, దానికి తోడు మద్యానికి బానిసైన మారెన్న అప్పులు తీర్చలేమోనని భయంతో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మారెన్న భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సుబ్రమణ్యం మృతదేహం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4: పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనంతరాజుపేట పంచాయతీ బంగ్లా మిట్టకు చెందిన తుపాకుల సుబ్రమణ్యం అలియాస్ చత్రపతి (35) వేటకు వచ్చి కొర్లకుంట పరిసరాల్లో పొలాలకు వేసిన కంచెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నెలకు రూ.50 వేలు సంపాదించాలి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 4: రైతు శాస్త్రవేత్తలు ప్రతి నెలా తమ పొలం ద్వారా ఎకరాకు రూ.50 వేలు సంపాదించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.వి జయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం అకాడమీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు శాస్త్రవేత్తలు రైతులందరికీ దిక్సూచిగా నిలవాలని, గ్రామాలను పర్యావరణరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. సిలబస్ గాని, టెక్స్‌బుక్స్ గాని లేని ఏకైక కోర్సు ఫార్మర్ సైంటిస్టు కోర్సు అని, ప్రధానంగా రైతు శాస్త్రవేత్తలు తమ వ్యవసాయ క్షేత్రంలో చేసే ప్రయోగాలే కోర్సులో ప్రాధాన్యత సంతరించుకుంటాయన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్, థియాటిక్ లీడ్‌లు సుధాకర్, విషి, సురేష్, ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, వీఎస్ఆర్ కడప జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, అకాడమీ అధికారులు సందీప్, శుభాకర్, సొహైల్, అచ్యుతన్, జిల్లా పాయింట్ పర్సన్స్, థిమాటిక్ పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.

జర్మన్ ప్రభుత్వ ప్రతినిధుల పరిశీలన : ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఆగ్రో ఎకాలజీ కార్యక్రమాలను పరిశీలించి బలోపేతం చేసే ప్రణాళికలను రూపొందించడం కోసం రాష్ట్రంలో పర్యటిస్తున్న జర్మన్ ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధి బృందం పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రిసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ (ఐజీజీఏఏఆర్ఎల్-అకాడమీ)ను సందర్శించింది. బీఎంజడ్ సీనియర్ పాలసీ అడ్వైజర్ క్రిస్టోఫ్ వాన్ స్టెచో, సీనియర్ పాలసీ ఆఫీసర్ అలెగ్జాండర్ లింగెంతాల్, కేఎఫ్‌డబ్ల్యూ కంట్రీ మేనేజర్ జోష్కా గ్రేవ్, సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ సంతీగ అగర్వాల్, ఎన్విరాన్‌మెంట్ క్లైమేట్ చేంజ్ అండ్ బయోడైవర్సిటీ విభాగం క్లస్టర్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ ఎల్.ఖవాద్, జీఐజడ్ న్యాచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ఆగ్రో ఎకాలజీ డైరెక్టర్ రాజీవ్ అహల్, ప్రాజెక్టు హెడ్ ఫర్ ఆగ్రో ఎకాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాసెస్ యాటే రిక్మాన్‌లు బృందంలో ఉన్నారు. అనంతరం అకాడమీ ప్రాంగణంలోఅంతర్జాతీయ బృందం సభ్యులు మొక్కలు నాటారు.

భర్తతో కలిసి తల్లిని కడతేర్చిన కూతురు


మృతి చెందిన యర్రక్క

వాల్మీకిపురం, ఫిబ్రవరి 4: భర్తతో కలిసి తల్లిని హత్య చేసిన ఓ కూతురి ఉదంతం బట్టబయలైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కనేకల్ ప్రాంతానికి చెందిన యర్రక్క (43) వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో తన కుమార్తె నందిని, శివరాంలతో కలిసి నివాసం ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. కుటుంబం కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి నందిని, తన భర్త శివరాం కలిసి తల్లి యర్రక్కతో గొడవపడ్డారు. అదే సమయంలో ఇనుపరాడ్‌తో యర్రక్కను కొట్టి గాయపరిచారు. గట్టిగా కేకలు విన్న సమీప వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యర్రక్కను ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది. స్థానిక ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమల ప్రాంతం వైపు వెళ్లిపోయిన ఏనుగులు

కలికిరి, ఫిబ్రవరి 4: వాల్మీకిపురం, కలికిరి మండలాల సరిహద్దు గ్రామాల్లో రెండు రోజుల పాటు కలకలం సృష్టించిన రెండు గున్న ఏనుగులు ఆదివారం సాయంకాలానికి ఇక్కడి నుంచి సోమల వైపు వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులు కూడా ధృవీకరించారు. చిత్తూరు జిల్లాలోని సోమల మండలానికి చెందిన నంజంపేట, రాంపల్లె, ఆవులపల్లె, సింగిరిగుంట, ఇరికిపెంట గ్రామాల పరిధిలోని మధురమలై రిజర్వు ఫారెస్టు ప్రాంతాలకు చేరుకున్నాయని సమాచారం. దీంతో వాల్మీకిపురం, కలికిరి సరిహద్దు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో తిరుగాడిన ఈ రెండు గున్న ఏనుగులు చెప్పుకోదగ్గ నష్టమేమీ కల్పించకపోవడం ఊరట కలిగించే అంశంగా చెబుతున్నారు. కాగా మేకలవారిపల్లె పరిసరాల్లో నిల్వ ఉంచిన సారా, సారా ఊటను మాత్రం తాగేశాయని చెబుతున్నారు. అంతకు మించి పంటలకు ఎలాంటి నష్టం కూడా కలిగించలేదు. సోమల అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగుల గుంపు నుంచి ఈ రెండు గున్న ఏనుగులు కలికిరి, వాల్మీకిపురం సరిహద్దు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలోకి చొరబడినట్లు ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆదివారమంతా మేకలవారిపల్లె, ఇట్లంవారిపల్లె కొత్తపల్లె ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు గుట్టపాళెం పంచాయతీ ఆచార్ల గొల్లపల్లె వైపు నుంచి సోమల అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అధికార వర్గాల సమాచారం. మొత్తం మీద ఇదివరకెప్పుడూ ఇటువైపు రాని ఏనుగులు అకస్మాత్తుగా రెండు రోజులపాటు కనిపించి పరిసర గ్రామాల్లో అలజడి కలిగించాయి.

పునాదులకే పరిమితం

- అర్ధంతరంగా ఆగిన మోడల్ స్కూల్ నిర్మాణం
- వెనక్కి వెళ్లిన రూ.5కోట్ల నిధులు
- మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు


పునాది దశలో నిలిచిపోయిన మోడల్ పాఠశాల భవనం

సంబేపల్లె, ఫిబ్రవరి 4: జిల్లా వ్యాప్తంగా మోడల్ స్కూల్ భవన నిర్మాణాలు పూర్తి చేసినా సంబేపల్లె మండలంలో పునాదులకే పరిమితం అయ్యాయి. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదర్శ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 453 మంది చదువుకుంటున్నారు. రెండు పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు 1000 మందిపైగా ఉన్నారు. కనీస మౌలిక వసతులు లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదులు సరిపోక చెట్ల కిందనే పాఠాలు బోధిస్తున్నారు. ఆదర్శ పాఠశాల భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిలిపేయడం, అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. దీంతో పాఠశాలకు వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే వచ్చిన డబ్బులు వెనక్కి వెళ్లిపోయాయని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నాడు- నేడు కింద నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో వచ్చిన నిధులను వివిధ పాఠశాలలకు తరలించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందించేందుకు 2014లో అప్పటి ప్రభుత్వం మోడల్ పాఠశాలలను మంజూరు చేసింది. ఏపీఈడబ్ల్యుఐడీసీ నిధుల కింద ఒక్కో దానికి రూ.5 కోట్లతో పాఠశాల భవనం, విద్యార్థులకు వసతితో కూడిన భవనాలను ఏర్పాటు చేసే విధంగా టెండర్లు పిలిచారు. అన్నమయ్య జిల్లాలో 17 మోడల్ పాఠశాలలు ఉండగా ఇప్పటికే రాయచోటి నియోజకవర్గంలో రాయచోటి, చిన్నమండెం, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేశారు. సంబేపల్లె మోడల్ పాఠశాల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ పనులు పునాది దశలోనే నిలిపివేయడంతో మంజూరైన రూ.5 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు 453 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు విద్యార్థులకు, సరిపడా గదులు లేక అవస్థలు పడుతున్నారు. కొంత మంది దాతల సహకారంతో కొన్ని షెడ్లు నిర్మించుకున్నారు. మోడల్ పాఠశాల భవన నిర్మాణ పనులు పునాది దశలోనే ఆగిపోవడంతో నాడు-నేడు కింద రూ.2.70 కోట్లు మంజూరయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం రూ.39 లక్షలు నాడు- నేడు కింద ఖాతాకు జమ అయ్యాయన్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలతో పాటు సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకే ఆవరణలో ఉండడంతో మరుగుదొడ్లు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అదనంగా రూ.36 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను చేయకపోవడంతో ఉన్న నిధులు వివిధ పాఠశాలలకు తరలించినట్లు తెలిపారు.


పాఠశాల వద్ద ఉన్న బోరు


పాఠశాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


గదుల కొరతతో చెట్ల కింద బోధిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి..



అన్నమయ్య జిల్లాలో 17 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి మండలంలో ఈ భవనాలు పూర్తి చేశారు. ఇప్పటివరకు సంబేపల్లె మండలంలో పూర్తి కాలేదు. వచ్చిన నిధులతో కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు ప్రయత్నించినా అడ్డుకుంటున్నారు. పనులు పూర్తి చేసేలా లేరు. దీంతో విద్యార్థులకు సరిపడే వసతులు కల్పించలేకున్నాం. జిల్లా అధికారులు పనులు పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి.

\- దిలీప్‌కుమార్, ప్రిన్సిపాల్,
మోడల్ స్కూల్, సంబేపల్లె

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి : పుత్తా


కొండపేటలో టీడీపీ నేత పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

చెన్నూరు, ఫిబ్రవరి 4 : టీడీపీని గెలిపించి ప్రతి ఇంటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని కొండపేటలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికీ తిరిగి టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెబుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నిమార్లు కరెంటు చార్జీలు పెరిగాయి, నిత్యావసర ధరలు ఎంతవరకు పెరిగాయి, చివరికి ప్రయాణం చేసేందుకు కూడా బస్సు చార్జీలు మూడురెట్లు పెంచారన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కొండపేటలో పుత్తాకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.

100 కుటుంబాలు టీడీపీలో చేరిక : గతంలో వైసీపీని ఆదరిస్తూ ఆ పార్టీకి మేం అండదండగా ఉన్నామని చెప్పుకునే వందకు పైగా కుటుంబాలు పుత్తా సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ టీడీపీ సీనియర్ నేత ఎన్.చిన్నిక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు, తరువాత అదే గ్రామంలో మరో 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికీ పుత్తా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వారంతా తాము టీడీపీ వెన్నంటే ఉంటామని, రాబోవు ఎన్నికల్లో తమ సత్తా చూపి టీడీపీ గెలుపు కోసం పాటుపడతామన్నారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషు, టీడీపీ నేతలు సంజీవ్‌పవన్, ఉండేల బాలక్రిష్టారెడ్డి, జిల్లా బలిజ సంఘం నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఐ.శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి. జిల్లా కార్యదర్శి పవన్, తెలుగుయువత అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జనసేన జిల్లా నేత ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు పాలగిరి సుదర్శన్ రెడ్డితో పాటు శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోచంపేటలో టీడీపీ స్టిక్కర్ల తొలగింపు

వైసీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ నాయబ్

కడప(ఎర్రముక్కపల్లె) జనవరి 4: కడప నగరం మోచంపేటలో టీడీపీ నాయకులు అతికించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ స్టిక్కర్లను వైసీపీ నాయకులు తొలగించారని టీడీపీ 31వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం 31వ డివిజన్ మోచంపేటలో గడప గడపకు వైసీపీ ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ప్రచారం చేస్తుండగా వైసీపీ కార్యకర్తలు టీడీపీకి చెందిన స్టిక్కర్లు తొలగించడంతో స్థానిక ఇన్‌చార్జ్ నాయబ్ వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతడిపై వైసీపీ కార్యకర్తలు విరుచుకుపడినట్లు సమాచారం. అలాగే తనకు వస్తున్న సంక్షేమ పథకాలను కట్ చేస్తామని స్థానిక కార్పొరేటర్ తనను హెచ్చరించినట్లు నాయబ్ తెలిపారు. ఈ విషయంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి నాయబ్‌తో కలిసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్టిక్కర్లు చించినంతమాత్రాన ప్రజల్లో టీడీపీకి ఉన్న అభిమానం పోదన్నారు. ఫ్లెక్సీలు చించడం, దర్పాషలాడటం ఉప ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. ఓటమి భయంతోనే ఆయన ఇలా చేస్తున్నారన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు.

నిత్య సహాయ తల్లి లూర్దుమాత




దైవసందేశం ఇస్తున్న ఫాదర్ ప్రసాద్, హాజరైన విశ్వాసులు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 4: లూర్దుమాతను ప్రార్థించిన ప్రతీ ఒక్కరికీ ఆ తల్లి సహాయపడుతుందని, అందుకే ఆ తల్లి నిత్య సహాయమాతగా విశ్వాసుల మన్ననలు పొందుతోందని ఫాదర్ ఆకుల ప్రసాద్ కొనియాడారు. మరియాపురం లూర్దుమాత తిరుణాల నవదిన మహోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజైన ఆదివారం స్థానిక మరియాపురం చర్చి ఆవరణంలో ఫాదర్ గుడిమే జేసుదాస్ (అమెరికా) దివ్యబలిపూజ సమర్పించారు. అనంతరం ఆకుల ప్రసాద్ లూర్దుమాత దివ్యసందేశం ఇచ్చారు. సాటి మనిషిని నమ్మినవారికి సహాయం అందవచ్చు, అందకపోవచ్చునేమో కానీ లూర్దుమాతను సహాయం అర్థించిన వారికి తప్పక సహాయం అంతుతుందని తెలిపారు. అందుకు విశ్వాసులే సాక్ష్యమన్నారు.

కావున విశ్వాసులు ఆ తల్లికి విధేయులుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసాదరావు, విశ్వాసులు పాల్గొన్నారు.

మత్స్యశాఖలో సిబ్బంది కొరత

- వర్క్ అడ్జెస్ట్‌మెంటు పేరుతో బదిలీలు
- అధికారుల కొరతతో చెలరేగుతున్న అక్రమార్కులు
- నిషేధిత వలలతో చేపల వేట

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో మత్స్యశాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్ని రోజులుగా ఆ శాఖకు సంబంధించి పర్మినెంటు అధికారులు లేకపోవడంతో మత్స్య సంపద అభివృద్ధితో పాటు మత్స్యకారుల సమస్యలు కూడా అపరిష్కృతంగానే ఉన్నాయి. రెగ్యులర్ అధికారులుగా ఉన్న డిప్యూటీ డైరెక్టరు రెడ్డిబాబును వర్క్ అడ్జెస్ట్‌మెంటు పేరుతో విజయవాడకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శాంతి అనే అధికారిణిని అనంతపురం నుంచి కడపలో నియమించారు. అసిస్టెంటు డైరెక్టరుగా కడపలో పనిచేస్తున్న రెడ్డయ్యను ఇక్కడ నుంచి విజయవాడకు బదిలీ చేశారు. మత్స్య అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన మత్స్య అభివృద్ధి అధికారుల ఖాళీలు కూడా సుదీర్ఘంగా నియామకానికి నోచుకోలేదు. జిల్లాలో కడప, మైలవరం, బి.మఠంలలో ముగ్గురు మత్స్య అభివృద్ధి అధికారులు ఉండాల్సి ఉండగా, కొంతకాలంగా మైలవరం పోస్టు ఖాళీగానే ఉంది. బి.మఠం మత్స్య క్షేత్రంలో పనిచేస్తున్న మద్దిలేటిని కర్నూలు జిల్లా సుంకేసులకు బదిలీ చేశారు. దీంతో జిల్లా అంతటికీ కడపలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ అనే ఎఫ్‌డీవో ఒక్కరే శాఖాపరమైన పనులను చూడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మత్స్యకారులకు అవసరమైనంత మత్స్య సంపద అందుబాటులో లేకుండా పోతోంది. దీంతో పాటు మత్స్య సంపద ఎక్కువగా ఉన్నచోట అక్రమ వేటలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మత్స్యకారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనే పరిస్థితులు కూడా లేకపోలేదు.

నిషేధిత వలలతో చేపల వేట

మత్స్యశాఖ జలాశయాల్లో ఉన్న మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు కొన్ని రకమైన వలలను నిషేధించింది. ఇందులో ప్రధానంగా అలవి వలలపై పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. ఈ వలలకు పెద్ద చేపలే కాకుండా చిన్న చిన్న చేపపిల్లలు సైతం చిక్కుకునే పరిస్థితి ఉంది. దీంతో మత్స్య సంపద అభివృద్ధి జరగకుండానే పిల్ల స్థాయిలోనే వేటగాళ్లకు చిక్కుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో అలవి వలలతో చేపల వేటకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

మత్స్య క్షేత్రాల్లోనూ ఖాళీలు

ఇదిలా ఉంటే మత్స్య క్షేత్రాల్లో ఫిషర్‌మేన్, ఫీల్డ్‌మ్యాన్ ఖాళీలు కూడా అలాగే ఉన్నాయి. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న మత్స్య క్షేత్రాలను అభివృద్ధి పరచాల్సిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదు. మైలవరం జలాశయానికి సమీపంలో ఉన్న మత్స్యక్షేత్రం పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. దీంతో అక్కడ క్షేత్రాన్ని మూసివేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం, కడపలలోని క్షేత్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. వీటిని వదిలేసి ఫిష్ ఆంధ్ర పేరుతో జిల్లాలో 24 చోట్ల చేపల వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ వాటి విక్రయ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.

మత్స్యకారులకు అందని పథకాలు

జిల్లాలోని మత్స్యకారులకు ఐదు నెలలుగా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడంలేదని అంటున్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం గతంలో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసి అందులోని సభ్యులకు చేపల వేటకు సంబంధించిన మెళకువలు నేర్పించడంతో పాటు విక్రయాలు, మార్కెటింగ్‌కు సంబంధించి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేసేది. సిబ్బంది కొరత కారణంగా మత్స్య సహకార సంఘాలకు ఎటువంటి న్యాయం జరగడంలేదని పలు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. దీంతో మత్స్య సహకార సంఘాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు జలాశయాల్లో మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు కొన్ని నెలల క్రితం ప్రభుత్వం చేప పిల్లలను జలాశయాల్లో వదిలేందుకు టెండర్లను ఆహ్వానించింది. టెండర్లు పూర్తయినప్పటికీ సప్లై ఆర్డరు ఇవ్వకపోవడంతో జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి రావలసిన చేప పిల్లలు రాకుండా ఆగిపోయాయి.

ఈ విషయమై మత్స్యశాఖ డీడీ శాంతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, సోమశిల వెనుక జలాల పరిధిలో లైసెన్సుదారులను మాత్రమే వేటకు అనుమతించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు వెయ్యిమంది మత్స్యకారులకు లైసెన్సులు ఇవ్వాల్సి ఉండగా 335 మందికి మాత్రమే ఇచ్చామని, త్వరలో మిగిలిన వారికి కూడా ఇస్తామన్నారు. నిషేధిత వలల విషయమై ఆమె స్పందిస్తూ అలాంటి వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాకు అందవలసిన చేప పిల్లలకు సంబంధించి డీడీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలోని జలాశయాల్లో తక్కువ స్థాయి నీటి మట్టం ఉండడం వల్ల చేప పిల్లలను వదలలేక పోతున్నామన్నారు. జూన్, జూలై నెలల్లో వచ్చే వర్షాకాలంలో నీటి లభ్యతను బట్టి జలాశయాల్లోకి చేప పిల్లలను అక్టోబరు, నవంబరు మాసాల మధ్య వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్

నూతన కమిటీ ఎన్నిక

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 4 : ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ కాంట్రాక్టు వింగ్ కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా నాగిరెడ్డి, కార్యదర్శిగా సురేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడిగా ఈశ్వరయ్య, ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటుగా జయక్రిష్టారెడ్డి, జనరల్ సెక్రటరీగా సురేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా నాగరత్నాచారి, కొండారెడ్డి, రామక్రిష్టారెడ్డి, శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గఫార్ బాషా, సహాయకార్యదర్శులుగా బ్రహ్మానందరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శేషికుమార్, జగదీష్‌రెడ్డి, గురుప్రసాద్, ట్రెజరర్ విశ్వనాథరెడ్డి ఎన్నికయ్యారు.

'వైసీపీ పాలనలో గుప్పుమంటున్న గంజాయి'

చెన్నూరు, ఫిబ్రవరి 4 :రాష్ట్రంలో టీడీపీ పాలనలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు వస్తే నేడు వైసీపీ పాలనలో గంజాయి గుప్పుమంటోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. చెన్నూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ వైసీపీలో జాబ్ క్యాలెండరు లేదని, ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. యువత ఉద్యోగాలు లేక గంజాయి మత్తులో జోగుతోందన్నారు. టీడీపీ నేతలు సుబ్రమణ్యం, మంజూరు అహ్మద్, ఖాదర్‌సాహెబ్, లక్ష్మయ్య, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 4: పట్టణంలోని అంబకపల్లె రోడ్డు మరియు ఎఫ్‌ఓసీ ఫీడర్ ప్రాంతాలలో సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అర్బన్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్‌పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 33/11కెవి పెద్దరంగాపురం సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆయా ప్రాంతాలలోని రైతులు, వినియోగదారులు సహకరించాలని అర్బన్, రూరల్ ఏఈలు కోరారు.

'సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 4 :సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంవంటిదని పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన 7.25 లక్షల రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రస్తుతం ఐదు లక్షల నుంచి రూ.25లక్షలకు పెంపు చేయడం అద్భుతమన్నారు. పేదలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రజలందరూ శాంతియుతంగా జీవించాలి



విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ మహేష్

కడప (కల్చరల్), ఫిబ్రవరి 4 : కడప నగరంలోని 48వ డివిజన్ కృపాకాలనీలో గల న్యూనేటివ్ కృపా చర్చిలో ఆదివారం దైవజనులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మలు భక్తులతో కలిసి విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలంతా ఆధ్యాత్మికంగా ఎదుగుతూ ఐకమత్యంగా ఆత్మీయంగా ఉండాలని, యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరమై మంచి అలవాట్లతో ఉన్నతంగా ఎదుగుతూ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. దైవ చింతనతో ముం దుకు పోతూ యేసు క్రీస్తు ఆశీస్సులు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, రవి, మహిమనిరీక్షణ, ఆగస్టీన్, భవనమ్మ,శివమ్మ, చిట్టెమ్మ, లీలావతి, రోజా అనేక మంది విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రోడ్లపై గుంతలతో రైతులకు ఇక్కట్లు



గుంతలమయంగా ఉన్న యల్లమ్మ కాలనీ - రామనపల్లె రోడ్డు

చెన్నూరు, ఫిబ్రవరి 4 : మండలంలో ఆయకట్టు రోడ్లకు అతీగతీ లేకుండా పోయింది. ఏళ్ల గడు స్తున్నా రోడ్లను పట్టించుకోకపోవడంతో రైతులకు ఇబ్బందిగా ఉంది. కమలాపురం కడపలోని మా ర్కెట్ యార్డు కార్యాలయం పరిధిలో ఉండటం తో రైతులు చైర్మన్ వద్దకు వెళ్లి నిధులు మం జూరు చేయించకుని పనులు చేయించకునేవారు. కానీ ఇప్పటి పరిస్థితి మారింది. నియోజకవర్గానికి ఒక మార్కెట్ యార్డు అంటూ చె న్నూరు, ఖాజీపేట, వల్లూరు, పెండ్లిమర్రి, చిం తకొమ్మదిన్నె మండలాలకు సంబంధించి కమలాపురంలో చైర్మన్‌ను నియమించారు. దీంతో రైతులు కమలాపురంలో చైర్మన్‌తో మాట్లాడి ని ధులు మంజూరు చేయించుకోలేని పరిస్థితి ఏ ర్పడింది. గతంలో పలుమార్లు చైర్మన్‌ను కలిసే రైతులు ఇప్పుడు అంతగా ఇష్టపడడం లేదు. ఇందుకు నిధులు లేకపోవడం కూడా కారణమే. ఒకవేళ అడిగినా నిధులు లేవని చెప్తారన్న ధోరణిలో ఉండిపోతున్నారు. ఫలితంగా మార్కెట్‌యార్డు ద్వారా చేపట్టే చాలా రోడ్లు ఇప్పటికే అలాగే ఉండిపోయాయి. గతంలో వీటికి పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంటు ద్వారా కాసింత గ్రా వెల్ వేసి రోడ్డు వేసినా అవి మట్టిరోడ్లే కాబట్టి నేటికీ గుంతలమయంగా ఉన్నాయి. పైగా కేసీ కెనాల్ నిధుల కింద ఈ రోడ్డు వేయాలన్నా అ క్కడ కూడా నిధులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఆ శాఖ ద్వారా పనులు చేపడితే నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి.

వేయాల్సిన రోడ్లు ఇవే...

చెన్నూరు కొత్తరోడ్డు నుంచి అరుంధతీనగర్ మీ దుగా పెద్ద కాల్వ వరకు, అక్కడి నుంచి రామనపల్లె రోడ్డు వరకు, రామనపల్లె వెళ్లే దారి నుంచి ముండ్లపల్లె వరకు రోడ్డు గుంతలమయమే. అలాగే రామనపల్లె నాలుగు రోడ్ల నుంచి ఓబులంపల్లె వరకు రోడ్డు కూడా అంతంత మా త్రమే. అంతే కాక కేఓఆర్ కాలనీ నుంచి రామనపల్లె రోడ్డు వరకు వ్యవసాయ పొలాలున్న రోడ్లు కూడా గుంతలమయయే. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి రోడ్డు గతంలో మట్టిరోడ్డు వేసినరోడ్డంతా ఇప్పుడు గుంతలమయంగా మారింది. సిమెంటు రోడ్డు వేసే వరకు కాసింత బాగున్నా పొలాల్లో, ఆయకట్టు రోడ్లన్నీ గుంతలమయమే. వీటిని ఎప్పుడు బాగు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే తాటతీస్తాం

- అంజద్‌బాషాకు సంస్కారం లేదు: శ్రీనివాసరెడ్డి
- అంజద్‌కు ఓటమి భయం పట్టుకుంది: మాధవీరెడ్డి





టీడీపీలో చేరిన ఆర్‌ఎస్‌యూ నాయకులతో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి, టీడీపీ నాయకులు.. వెంకటాపురంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పుత్తా

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4 : వ్యక్తిగత విమర్శలు చేస్తే తాట తీస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాకు సంస్కారం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కడప నగరం అష్టలక్ష్మి కళ్యాణ మండపంలో ఆర్‌ఎస్‌యూ నాయకుడు రవిశంకర్‌రెడ్డి తన అనుచ రులతో టీడీపీలో చేరారు. వారిని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తన నోటిని అదుపులోకి పెట్టుకోవాలని, అవాకులు చవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఫ్లెక్సీ రాణి అని మాధవీరెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన అంజద్‌బాషాకు సంస్కారం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నమన్నారు. అయితే ఫ్లెక్సీలకు సంబంధించిన అన్ని పన్నులు కార్పొరేషన్‌కు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. అంజద్‌బాషా తన తమ్ముడు, అల్లుడు పుట్టిన రోజుకు కడప నగరమంతా ఫ్లెక్సీలు వేసుకున్నారని, ఒక్క పైసా అయినా కార్పొరేషన్‌కు చెల్లించారా అని ప్రశ్నించారు. అంజద్‌బాషా నాలుగు 'సీ'ల బాషా అని మొదటి సి అంటే కరప్షన్, రెండోది కటింగ్, మూడు కలెక్షన్, నాలుగు కమిషన్ అని తెలిపారు. దమ్ముంటే అంజద్‌బాషా కౌంటర్ ఇవ్వాలని సవాల్ చేశారు. పేటీయం బ్యాచ్‌లతో విమర్శలు చేయించడం సరికాదన్నారు. కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి మాట్లాడుతూ అంజద్‌బాషాకు ఓటమి భయం పట్టుకుందన్నారు. తను ఊగిపోతూ మాట్లాడడం చూస్తుంటే తన అనుచరులు బాషాకు ఆసుపత్రిలో చూపించి వైద్యపరీక్షలు నిర్వహించాలని సూచించారు. 2014 ఎన్నికల్లో అంజద్‌బాషా నిద్రపోయాడని, ఇప్పుడు జగన్ ప్రభుత్వం వచ్చాక కడపలో కబ్జాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారిపోయాడన్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని అంజద్‌బాషా ఊగిపోతూ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాగే డబ్బు పొగరుతో అంజద్‌బాషా మాట్లాడడం సరికాదన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అంజద్‌బాషా ఇంటికి వెళ్లడం ఖాయమని జోస్యం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, రాష్ట్ర బెస్త సాధికార సంఘం అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు మోసం

మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు మోసం చేస్తోందని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఖాళీలు 50892 ఉండగా ప్రకటించినవి 6100 మాత్రమేనని చెప్పారు. ఎన్నికల వేళ జగన్ ప్రభుత్వం కొత్త నాటకానికి తెర లేపిందన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలను గుర్తించినట్లు తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేవలం 6100 పోస్టులుకు మాత్రమే నోటిఫికేషన్ ప్రకటించిన చేతులు దులుపుకుందన్నారు. ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్మీడియట్ పరీక్ష వాయిదా వేయడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల జీవితాలతో సీఎం ఆడుకుంటున్నారన్నారు. సభ కోసం ఐదు లక్షల మంది విద్యార్థుల పరీక్షలు వాయిదా వేయకూడదని ఈ ఫస్ట్ క్లాస్ స్టూడెంట్‌కు తెలియదా అని ప్రశ్నించారు.

పుత్తా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో 50కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 4: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన లింగదారి వీరయ్య యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 50కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డిలు పార్టీలో చేరిన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకట హరిగిరిప్రసాద్, సి.గోపాల్, ఆంజనేయులు, బాబు గంగరాజు, కృష్ణయ్య, బాల వీరయ్యలతో పాటు మరిన్ని కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి గండి ఓబయ్యయాదవ్, మాజీ ఆలయ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, గంగిరెడ్డిపల్లె పోలీస్‌రాజు, పాయసంపల్లె మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, వాసుదేవరెడ్డి, చంద్ర, తాటిమాకులపల్లె గోవిందరెడ్డి, పాలగిరి చైతన్యరెడ్డి, ఎస్ఆర్ పేటకాలనీ జనార్ధన్‌రెడ్డి, లోకేష్‌యాదవ్, సర్పంచు ఓబులేష్, చిన్న ఓబులేస్, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.పాలగిరి మాజీ సర్పంచు గోపాల్‌యాదవ్, మాజీ సర్పంచు రామచంద్రారెడ్డి, కిషోర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని సాగనంపేందుకు ప్రజలు సంసిద్ధం కావాలి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 4: వైసీపీ అరాచక పాలనను సాగనంపేందుకు కడప ప్రజలంతా సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గం ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి ప్రజలకు సూచించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక అగాడిలోని (బళ్లారి రోడ్) ఏసియన్ ఫంక్షన్ హాలులో టీడీపీ సీనియర్ నాయకులు షేక్ జమీల్ సారథ్యంలో కువైత్, సౌదీ, ప్రవాసాంధ్రుల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది కువైత్, సౌదీ ముస్లిం, మైనార్టీ మహిళలు వాసు, ఆర్. మాధవి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగివేసారి పోయారన్నారు. ఎన్నికలెప్పుడు వచ్చినా వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్ఆర్ఐ షేక్ రహీదాబేగం, టీడీపీ తిరుపతి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు ఉషాదేవి, రాజంపేట నియోజకవర్గం మైనార్టీ నాయకురాలు మెహరాజ్‌బేగం, టీడీపీ సీనియర్ నాయకులు జిలానీబాష పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగుల జీవితం అంధకారమయం

- టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు



మాట్లాడుతున్న ఆమూరి బాలదాసు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4 : వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగుల జీవితం అంధకారమయమైందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహ్మాన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాదికి ఐదు లక్షల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి తగిన ఉపాధి లేక వలసలు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కొంతమంది అయితే ఉపాధి లేక హెరాయన్, గంజాయి మత్తు విక్రయాలకు బానిసలై వారి జీవితాలను అగమ్యగోచరంగా చేసుకుంటున్నారన్నారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉండేదని, హైదరాబాదు ఆదాయం 60వేల కోట్లు నష్టంతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయినా సమర్థవంతమైన ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కుంటుపడకండా ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ ప్రతి నెలా 1నే ఉద్యోగాలకు జీతాలు చెల్లించిన ఘనత టీడీపీదన్నారు. రాష్ట్రం బాగుండాలంటనే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలందరూ టీడీపీ విజయానికి కృషి చేసి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇమ్రాన్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల కోసం పోరాటం సాహసమే: సీపీఐ



డీహెచ్‌పీఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న చంద్ర, ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4:దళిత హక్కుల కోసం పోరాటం అంటే ఎంతో సా హసోపేతమైన కార్యక్రమమని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. ఆదివారం కడప నగరం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో అంబేద్కర్ దళితుల కోసం పొందుపరిచిన చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. చట్టసభల మీద పోలీసులు న్యాయ వ్యవస్థ మీద ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత మైనార్టీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు. మత ప్రాతిపదికన మెజార్టీలను సంతృప్తి చిందించడానికి అన్నదమ్ముల్లా కలిసి ఉన్న భారతదేశ ప్రజలను విడదీస్తూ పరిపాలన చేయడం సిగ్గుచేటన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కేసీ బాదుల్లా, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కానుగల మునెయ్య, నాయకులు గోవిందు, తారకరామారావు, నరసింహులు, రాజశేఖర్, ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, బాబు, విజయ్ పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ప్రిన్సిపాల్ సలీంబాషా



రామనపల్లెలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 4:పరిసర ప్రాంతాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రిన్సిపాల్ వి.సలీంబాషా తెలిపారు. ఆదివారం కడప నగరంలో కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. రామనపల్లె గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మాస్కులు, ఐరన్ ట్యాబ్లెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియామాల గురించి ప్రజలకు వివరంచారు. ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల గురించి వి వరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ విజయలక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై 16న నిరసనలు



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 4: కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్, దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్, భాస్కర్, శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కడ ప నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సర్వర్ సమస్యతో జగనన్న కాలనీల లబ్ధిదారుల ఇక్కట్లు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెంకటశివ

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 4:జగనన్న కాలనీల్లో నివాస గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో గంటల తరబడి సర్వర్, లాగిన్, ఈకేవైసీ సమస్యలతో జనం ఇబ్బందులు పడుతున్నారని, సర్వర్ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, నగర కార్యవర్గ సభ్యులు మల్లిఖార్జున, భాగ్యలక్ష్మి, బుజ్జి తెలిపారు. ఆదివారం స్థానిక జగనన్న కాలనీల గృహ లబ్ధిదారులతో వెంకటశివ మాట్లాడారు. జగనన్న కాలనీలోని ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ఉదయం 8గంటలకే తహసీల్దారు కార్యాలయం వద్దకు రావాలని సంబంధిత వలంటీర్లు లబ్ధిదారులకు ఫోన్లు చేసి చెప్పారని, ఇళ్లపట్టాలు తీసుకుని పిల్లలతో తరలివచ్చిన లబ్ధిదారులు సర్వర్ సమస్య అంటూ ఒకసారి, లాగిన్ కాలేదని మరోసారి, ఈకేవైసీ సమస్య అని ఇంకోసారి చెప్పడం బాధాకరమన్నారు. సర్వర్ సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చెక్కును అందజేస్తున్న మాదా సుబ్బరాయుడు దంపతులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 4: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భయనపల్లెకు చెందిన మాదా సుబ్బరాయుడు-లలితమ్మ దంపతులు, వారి కుమార్తె లక్ష్మీశైలజ, కు మారుడు క్రిష్ణచైతన్య, కోడలు సౌమ్య, మనవరాలు హనిస్వి కలిసి రూ.1,00,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వారిని సంప్రదించగా వారు సానుకూలంగా స్పందించి ఆ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు రూపంలో అందించారు. వారి కుటుంబ సభ్యులకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. క్రిష్ణప్రసాద్, గోపాల్, సుధాకర్, అర్జున్, జగదీష్ పాల్గొన్నారు.

బలిజలు అన్ని రంగాలలో ఎదగాలి: వీపీఎన్ స్వామి



నూతన కమిటీ బాధ్యులకు నియామక పత్రాలను అందజేసిన వీపీఎన్ స్వామి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 4:గ్రేటర్ రాయలసీమలో బలిజ వర్గీయలు సుమారు 36 లక్షలకు పైగా ఉన్నారని, వీరంతా అన్ని రంగాలలో ఎదగాలని ఏపీ స్టేట్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు వి.పి. నారాయణ స్వామి కోరారు. ఆదివారం స్థానిక కాపునాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత ఏపీ స్టేట్ కాపునాడు నూతన కమిటీని ప్రకటించారు. ఇందులో కాపునాడు గ్రేటర్ రాయలసీమ అధ్యక్షుడిగా జి.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకటేశ్వర్లు, కడప జిల్లా అధ్యక్షుడిగా ఎన్.సుబ్బనరసింహులును ఎన్నుకున్నారు. ఆ మేరకు వారికి నియామక ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. కె.కృష్ణమూర్తి, వెకంటసుబ్బయ్య, సురేష్ పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 4: నగర రిమ్స్ సమీప శిల్పారామం కళావేదిక మీద సంబంధిత పరిపాలనాధికారి పి. శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం ఆటవిడుపులో భాగంగా కడప నగరానికి చెందిన షర్మిల ఇంగ్లీషుమీడియం స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు పలు పల్లె.. జానపద, సినిమా పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.

8న చలో విజయవాడను జయప్రదం చేయండి



వేములలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

వేముల, ఫిబ్రవరి 4: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 8వ తేదీన నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వేంపల్లెలో ఆయనవిలేకరులతో మాట్లాడుతూ ఒ క్కొక్క విద్యార్థికి రూ.10 నుంచి రూ.15 ఇవ్వాలన్నారు. వం టకు సరిపడా గ్యాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేయాలి, మధ్యాహ్నం భోజన కార్మికులకు నెలజీతం రూ. 10వేలు ఇవ్వాలి, రాగిజావకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటటాయించాలని, మెర్జ్ అయిన స్కూల్స్‌ను వెనక్కు తీసుకోవాలి, నాల్గవ తరగతి ఉద్యోగులకు గుర్తించి కనీస వేగనం చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మభ్యపెట్టే మాటలను నమ్మే రోజులు పోయాయి

- సదస్సులో ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్ర కన్వీనర్ రమణ



సంఘీభావం తెలుపుతున్న కూటమి నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 4: ఉచిత తాయిలాలంటూ అదేదో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన ఇంట్లో నుంచి స్వంత డబ్బు తెచ్చి ప్రజలకు పంపకాలు చేసినట్లుగా 182 సార్లు బటన్ నొక్కి మరీ ఇస్తున్నానంటూ డబ్బా కొట్టుకోవడం విడ్డూరంగా ఉందని ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్ర కన్వీనర్ బి.సి.రమణ పాలక ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఇప్పటికే విసిగి వేశారిపోయిన ప్రజలంతా వచ్చే సార్వత్రిక ఎన్నికల రోజున రెండు సార్లు బటన్ నొక్కి జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపడం తథ్యమని జోస్యం చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన హామీలను కేంద్రం నుంచి తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. ప్రత్యేక హోదా గాలికి వదిలేయడంతో పాటు పోలవరం పనులు నత్తనడకన. ఇక కడప ఉక్కుకు గత 15 సంవత్సరాలుగా దిక్కేలేదన్నట్లుగా ఉన్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో దోచుకొని దాచుకునే నాయకులందరినీ ఇంటికి పంపించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, కూటమి ప్రధాన కార్యదర్శి జయబాబు, సమన్వయకర్త జైభీం ప్రసాద్, కో కన్వీనర్ అప్పలరాజు, నాయకులు సుమంత్ ఆజాద్, బీ.సీ. నాయకులు డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పదో తరగతి ప్రజ్ఞా వికాస పరీక్షను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 4 : పదో తరగతి విద్యార్థులకు ఈనెల 6న నిర్వహించే ప్రజ్ఞా వికాస్ మోడల్ పరీక్షను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. ఆదివారం జీవనజ్యోతి పాఠశాల వద్ద మోడల్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందన్నారు. 6న మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ప్రతిభకనబరిచిన విద్యార్థులకు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జిల్లా స్థాయిలో టాప్ టెన్ బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4: జమ్మలమడుగు పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కిమ్స్ సవీరా ఆస్పత్రి అనంతపురం వారి ఆధ్వర్యంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 150 మందికిపైగా రోగులు పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ కమిటీవారు తెలిపారు. పరీక్ష చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే పల్లా తిరుపతయ్య, ఎత్తపు కొండారెడ్డి వారిచే 4వ ఫ్రీజర్ వితరణ చేశారు. ముందుగా మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ ప్రారంభించారు. అనంతరం జడ్డి భార్గవి వైద్యశిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌నాయక్, మేనేజర్ రామాంజనేయులు, కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది, సంస్థ అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, సెక్రటరీ బి.టి.నరసింహారెడ్డి, మానవతా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. డాక్టర్లు హరిప్రకాష్, ప్రమోద రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం చేయాలని తెలిపారు. మన ప్రజాసేవా సమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవా సమితి గౌరవాధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షుడు బాషా, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారి మహమూద్, షఫీ, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 4 : అన్ని మతాల వారి శ్మశాన వాటికలకు మౌళిక వసతులు కల్పిస్తామని కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని మీనాపురం గ్రామంలో క్రైస్తవుల శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించే పనులు పూర్తికావడంతో వాటిని శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివచంద్రారెడ్డిని క్రైస్తవులు సన్మానించారు. కార్యక్రమంలో కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఇస్మాయిల్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 : అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన బాధిత రైతులు చంద్రశేకర్‌రెడ్డి, జకియాబేగం, ఎం.మల్లికార్జునరెడ్డి, షేక్ హుసేన్‌పీరా పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 1185/1లో ఎన్‌హెచ్ 167-బి రోడ్డు విస్తరణలో భాగంగా వచ్చే నష్టపరిహారం కోసం ముగ్గురు రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి లంచాలకు దిగి తప్పుడు సర్వేతో అసలైన లబ్ధిదారులకు గండి కొట్టారన్నారు. ఈ విషయంపై డిప్యూటీతహసీల్దారు సంజీవరెడ్డిని వివరణ కోరగా, నకిలీ కాగితాలు చూపించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఆర్డీవో కార్యాలయం నుంచి తమకు కాపీ అందిందన్నారు. అలాగే రెవెన్యూ అధికారులకు సంబంధించి క్రమశిక్షణ చర్యలకు కలెక్టరుకు సిఫారసు చేశామన్నారు.

'మెగా డీఎస్సీతో ప్రజలను మాయ చేస్తున్న సీఎం'

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 :మెగా డీఎస్సీ పేరుతో ప్రజలను సీఎం జగన్ మాయ చేస్తున్నారని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 50,892 పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇది నిరుద్యోగులను వంచించడమే కాదా అని ప్రశ్నించారు. డీఎస్సీ పేరుతో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్‌క్యాలెండరు విడుదల చేస్తామని నాలుగేళ్ల జగన్ చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు ఈ పోస్టులు చూపించి నిరుద్యోగులను వంచించే జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పన కల్పించే టీడీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు.

పుట్టా ఎమ్మెల్యేగా గెలవాలంటూ పాదయాత్ర



నందిపల్లె గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్న నాగిపోగు రవిబాబు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 4 : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ రానున్న 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆదివారం బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నాగిపోగు రత్నం కుమారుడు నాగిపోగు రవిబాబు ఆధ్వర్యంలో నందిపల్లె గ్రామం నుంచి కరుణగిరి పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను బి.మఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మద్దతు తెలిపి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకి చెందిన రామాంజనేయులు, నాగిశెట్టిపల్లె నాయకులు రవిచంద్ర, కళ్యాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భూపేశ్ ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ

కొండాపురం, ఫిబ్రవరి 4: కొండాపురం పట్టణంలో ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓబన్నపేట నుంచి పాతకొండాపురం వరకు మండలంలోని టీడీపీ నాయకులు,కార్యకర్తలు బైక్‌లలో టీడీపీ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పూలు చల్లుకుంటూ, బాణసంచా పేల్చుతూ దారిపొడువునా ర్యాలీ నిర్వహించారు.

బాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో టీడీపీ నేతలు





పోరుమామిళ్లలో అరటిపండ్ల వ్యాపారికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న, ఎర్రగుంట్ల ఆర్టీపీపీలో ప్రచారం నిర్వహిస్తున్న భూపేశ్‌రెడ్డి తదితరులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 : అన్నివర్గాల వారికి సరైన న్యాయం జరగాలంటే అది చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా మేనిఫెస్టో వివరిస్తూ మెయిన్‌బజారులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, శెట్టెంప్రతాప్, సీతాబాలాజీ, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ ఎస్ఎంబాషా, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, రామసుబ్బారావు, షరీఫ్, సత్యరాజ్, దానం, గఫార్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ప్రజలను మభ్యపెట్టి ఓట్లను దండుకునే ప్రయత్నం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆర్టీపీపీలో ఆయన బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీపీపీలోని కాలనీలో ఆయన ఇంటింటికి వెళ్లి టీడీపీ ఇస్తున్న హామీలపై వివరించారు. ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల బాధ్యులు మోహన్‌రెడ్డి, జనసేన నాయకుడు జగదీష్, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, రంగనాయకులు, శ్రీనివాసులు, రమణయ్య, వజీర్‌శ్రీను, రవిశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, నారాయణస్వామి, అంజి, తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు విజయనగరం వీధి ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి

ప్రొద్దుటూరు..:టీడీపీ తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విజయనగరం వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, మాజీ కౌన్సిలర్లు భాగ్యమ్మ, తాటిశ్రీను, ఆవుల దస్తగిరి, టీడీపీ 35 వవార్డు ఇన్‌చార్జ్ సుబ్బు, 37 పొట్టిపాటి గంగాధర్ , 41 శూలం లక్ష్మీదేవి, మధుబాబు, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

8న ఎమ్మార్పీఎస్ సభకు తరలి రండి

కొండాపురం, ఫిబ్రవరి 4: ఈ నెల 8న కడపలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణరాజు ఆధ్వర్యంలో జరిగే మాదిగ ఉపకులాల రాజకీయ సమన్వయ మహాసభకు మండలంలోని ఎమ్మార్పీఎస్ సభకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బాయికాటి రమేష్ తెలిపారు.ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విడుదల చేశారు. నాయకులు రామాంజి, నాగసుబ్బరాయుడు, నాగన్న,పెద్దన్న,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డీఎస్పీగా యశ్వంత్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4: జమ్మలమడుగు డీఎస్పీ కొత్తగా ఆదివారం సాయంత్రం డాక్టర్ యశ్వంత్ బాధ్యతలు చేపట్టారు. ఈయన చంద్రగిరి నుంచి బదిలీపై జమ్మలమడుగు డీఎస్పీగా వచ్చారు. సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఆయా పోలీసు స్టేషన్‌కు సంబంధించిన సీఐలు, ఎస్ఐలతో ఆయన మాట్లాడారు. అలాగే జమ్మలమడుగు అర్బన్ ఎస్ఐగా కల్పన బాధ్యతలు తీసుకున్నారు. ఈమె కర్నూలు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గతంలో అర్బన్ పోలీసు స్టేషన్‌లో ట్రైనింగ్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా జమ్మలమడుగు వచ్చారు.

గండికోట ముంపు పరిహారం త్వరగా ఇప్పించండి

కొండాపురం, ఫిబ్రవరి 4: గండికోట ముంపు పరిహారం త్వరగా ఇప్పించాలని నిర్వాసితులు ఆదివారం కొండాపురంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి ని కలిశారు.త్వరలో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఆలోపు పరిహారం ఇప్పించేలా చూడాలని వారు కోరారు. ప్రభుత్వం హామి ఇచ్చిన విధంగా వెంటనే పరిహారానికి నిధులు విడుదల చేయించాలని వారు కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీ అవినాశ్‌రెడ్డిని కలవాలని సూచించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాసితులు లాజర్,సద్దాం తదితరులు పాల్గొన్నారు.

దురాక్రమణలో భాగంగానే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు

పాలస్తీనా స్వేచ్ఛకోసం గళమెత్తుదాం పుస్తకపరిచయ సభలో - తవ్వాసురేష్



మాట్లాడుతున్న తవ్వా సురేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 4 :అమెరికా సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా పాలస్తీనాలోని గాజాలో వున్న ఆయిల్ నిక్షేపాల దోపిడీ కోసం పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని జన విజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో పాలస్తీనా స్వేచ్ఛకోసం గళం విప్పుదాం అనే వ్యాస సంకలన పుస్తక పరిచయ సభ జరిగింది. ఈసభలో తవ్వా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇజ్రాయిల్ దురాక్రమణపై ఐ.రా.స కేవలం తీర్మాణాలకే పరిమితం కావడం వెనుక అమెరికా హస్తం వుందన్నారు. పాలస్తీనాలో ఇజ్రాయిల్ ఆక్రమించిన ప్రాంతాలు ఏ ఒక్కటీ తిరిగి ఇవ్వలేదన్నారు. చరిత్రలో ఇజ్రాయిల్ దేశంలేదని అది బ్రిటీష్ వలస పూర్తయ్యాక ఏర్పడిందన్నారు. సామ్రాజ్యవాద దేశం అమెరికా నేడు ప్రపంచవ్యాప్తంగా తన వలస దోపిడీని కొనసాగించడానికి 180 సైనిక స్థావరాలను ఏర్పరుచుకుందన్నారు. దీన్ని బట్టి అమెరికా ప్రపంచ పోలీసుగా అభివర్ణించవచ్చన్నారు. గతంలోఇండియా పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడేదన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇజ్రాయిల్ వైపు మాట్లాడటం అమెరికా దురాక్రమణ సిద్ధాంతాన్ని సమర్థించడమేన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు గోపినాధరెడ్డి,దస్తగిరి రచయితలు దాదాహయాత్, వరలక్ష్మి, మహమూద్ పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 4 : అమృతానగర్ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న ధర్నా ఆదివారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అయితే వారికి మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు, ఉషా, బాష, పార్వతి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా తులసి సుధాకర్, పెసల నరసింహులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 : జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా పోరుమామిళ్లకు చెందిన తులసి సుధాకర్, పెసల నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పులివెందులలో జరిగిన ఆర్యవైశ్య సమావేశంలో వీరిద్దరినీ ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు

మైదుకూరు, ఫిబ్రవరి 4 : పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించారు. ప్రధాన రహదారులపై వాహనాల రాక పోకలతో వాహన దారులతో పాటు పాదచారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడున్నారు. కాగా సీఐ మస్తాన్‌తో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి ఆదివారం సాయంత్రం ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్పిస్తున్న తోపుడు బండ్లు, ఇతర వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇక మీదట ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 : ప్రొద్దుటూరు పట్టణం టూటౌన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జూదమాడుతున్న పదిమంది వ్యక్తులను టూటౌన్ సీఐ ఇబ్రహీం, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేసి పట్టుఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.52.500నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు.

ముగిసిన మాధవుని పార్వేట ఉత్సవాలు



పల్లకిలో శ్రీదేవి,భూదేవితో మాధవరాయస్వామి

మైదుకూరు, ఫిబ్రవరి 4 : సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక పాతూరులోగల శ్రీలక్ష్మి మాదవరాయస్వామి పార్వేట ఉత్సవాలు ఘనం గా ముగిశాయి. కనుమ నాడు శ్రీదేవి, భూదేవీలతో మాదవరాయ స్వామిని పట్టణంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ పార్వేట ఉత్సవం పట్టణ పరిధిలోని 16 గ్రామాలలో ఊరేగింపు నిర్వహించి తిరిగి ఆదివారం మైదుకూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా సాయం త్రం ప్రధాన రహదారులపై స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీహోమాలు



మైదుకూరు, ఫిబ్రవరి 4 : పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాలాధారులచే ఆదివారం హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 11న వాసవీ మాత ఆత్మార్పన దినోత్సవం సందర్భంగా పలువురు వాసవీ మాలలు ధరించి, నవగ్రహ హోమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి వాసవీమాతకు అభిషేకాలు నిర్వహించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి కెరీర్ గైడెన్స్ పుస్తకం

కలసపాడు, ఫిబ్రవరి 4 : పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్ పుస్తకం దిక్సూచి లాగా ఉపయోగ పడుతుందని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామక్రిష్టారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండ్లిమర్రి గ్రామం వద్ద ఉన్న కస్తూర్బాగాంధి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదో తరగతి చదువుతున్న 37 మంది బాలికలకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.ప్రభావతి, బాలికలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 : కడపలో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి పోరుమామిళ్ల రీజియన్ ఉపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి, సురేంద్ర, సుబ్బయ్య, అన్వర్‌బాషా, సత్తార్, క్రిష్టారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలజోజి, బాల ఓబయ్య, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి తరలివెళ్లారు. ఆదివారం వీరు పోరుమామిళ్ల నుండి కడపకు సమావేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 25 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్ భారాన్ని తగ్గించాలని, డీఏ విడుదల చేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

గోపవరం, ఫిబ్రవరి 4 : మండలంలో ఆరోగ్యశ్రీకార్డు డిస్ట్రిబ్యూషన్ ఆదివారం ఏఎన్ఎం, పంచాయతీ సెక్రటరీ ద్వారా పంపిణీ చేశారు. మొత్తం ఆరు పంచాయతీలకు గాను 5211 కొత్త కార్డులు ఏర్పడినట్లు పంచాయతీ సెక్రటరీ తెలిపారు. అలాగే ఈ హెల్త్ కార్డుల ద్వారా రూ.25లక్షల పరిమితికి ఆరోగ్యశ్రీ పెంచినట్లు వారు తెలుపుతూ ఆ సేవలు వినియోగించుకోవాలని కోరారు. గోపవరం 1067, బ్రాహ్మణపల్లె 702, కాల్వపల్లె 715, రాచాయిపేట 841, టి.సండ్రపల్లె 1102, బేతాయిపల్లె 784 మొత్తం 5211 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు మంజూరు కాగా, ఆదివారం 137 కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

పదవీ విరమణ తర్వాత సమాజ సేవకు పాటుపడాలి



పరమేశ్వరయ్యకు సన్మానం చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4: పదవీ విరమణ అనంతరం ఉపాధ్యాయులు, ఉద్యోగులు తోటి వారికి సహాయ సహకారాలు అందిస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జమ్మలమడుగు మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన జమ్మలమడుగు మండల విద్యాశాఖాధికారి పరమేశ్వరయ్య పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, ఎంఈవో వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, నాగిరెడ్డి, అనూరాధ, రాజ్యలక్ష్మి, జరీనాబేగం, సుదర్శనమ్మ, వేదవతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుట్టా రూ.50 వేలు ఆర్థికసాయం

చాపాడు, ఫిబ్రవరి 4: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన రెండు జట్ల విద్యార్థులకు మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం రూ.50 వేలు నగదు ఆర్థికసాయం అందజేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ రెండు జట్ల విద్యార్థులు గత నెల 24వ తేదీన మైదుకూరులో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఖోఖో పోటీల్లో మొదటిస్థానం పొందారు. ఒకటి బాలికల జట్టు కాగా మరొకటి బాలుర జట్టు. ఒక్కొక్క జట్టుకు రూ.25 వేలు చొప్పున రెండు జట్లకు ఆర్థికసాయం అందజేశారు.

భారీగా టీడీపీలోకి వలసలు

దువ్వూరు (మైదుకూరు), ఫిబ్రవరి 4 : అధికార పార్టీ నుంచి ప్రజా ప్రతినిధులతో సహా పలు కుటుంబాల వారు టీడీపీలోకి వలసలు వచ్చే వారి సంఖ్య మైదుకూరు నియోజకవర్గంలో పెరిగిపోతోంది. ఈ క్రమంలో ఆదివారం దువ్వూరు మండలంలో బుక్కాయపల్లె అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ చెన్నక్కగారి సిద్దారెడ్డి, నాయకులు రఘురాముడు వారి అనుచర కుటుంబాల వారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దువ్వూరుకు చెందిన కోనేటి హరినాథ్, ఆయన అనుచరులు కోకల హరినారాయణ, ఎనమల రకాజు, గురివిరెడ్డికి చెందిన దాదాపు 30 కుటుంబాల వారిని కూడా ఆయన టీడీపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోరెడ్డి వెంకట రమణారెడ్డి, పాపినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: వైసీపీ నుంచి వార్డుమెంబరు వెంకటరమణ,దర్శి శ్రీనివాసులు, చిన్న శ్రీను, కె.రమణయ్య, శ్రీను, చిన్న వెంకటసుబ్బయ్య, జి.సుధ, చంద్రమౌళితో పాటు 12 కుటుంబాల వారు యువనేత రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం పోరుమామిళ్లలోని శ్రీనివాసనగర్‌లో వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, సోమిరెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, రవీంద్రరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సాదనకారి రంతు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ కనమర్లపూడి ప్రసాద్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని పాతకొండాపురం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.పాతకొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి,ప్రసాద్,గోవర్ధన్‌రెడ్డి, తలారి శేఖర్,మనోహర్,రవి,లక్ష్మీకాంత్‌రెడ్డి,రవి,జయరామిరెడ్డి తదితరులు వైసీపీ నుంచి టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా వారు భూపేశ్‌కు పెద్దఎత్తున స్వాగతం పలికారు.పార్టీ కండువా కప్పి వారిని భూపేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు చామల శ్రీనివాసులరెడ్డి, చామల బాబులరెడ్డి ,మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు చామల పద్మజ ,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





పోరుమామిళ్లలో రితీష్‌రెడ్డి, మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ చేరుతున్న దృశ్యం